# అగాధమైన ఆలోచన

అబ్బాయి అగాధమైన ఆలోచనలో పడ్డాడు. పడే పడటంతోటే అమాంతం రాయిలాగా ఆలోచనలో మునిగి ఊరుకున్నాడు.

అబ్బాయికి ఉక్కిరి బిక్కిరయింది. కళ్లు తెరచటానికి కష్టమయింది. బలవంతాన తెరిచి చూసినా ఏమీ కనిపించలేదు.

అబ్బాయి కాళ్లూ చేతులూ గిలగిలా తన్నుకున్నై. కాని ఆ అగాధంలో వాడి కాలికి ఊతం గాని, చేతికి పట్టుగాని చిక్కలేదు.

❀ ❀ ❀ ❀ ❀

అదివరకల్లా అబ్బాయి చిన్న చిన్న ఆలోచనల్లోకి అమాంతం దూకి కాళ్లు చేతులూ కొడుతూ అటూ ఇటూ తిరిగి, కొందరి చేత, "ఆహా! వాడికాలోచనల్లో తేలటం కూడా చాతవునే?" అనిపించుకుని ఉన్నాడు.

తనకు ఆలోచనల్లో ఈదటంలో ప్రజ్ఞ ఉందని భ్రమపడ్డ వాళ్లంతా తెలివిగల వాళ్లని అబ్బాయి భ్రమపడ్డాడు. తన శక్తి సామర్థ్యాలు సరిగా గ్రహించుకోక, తనను ప్రశంసించిన వాళ్ల మాటలు మాత్రమే నమ్మి, ఇవాళ అబ్బాయి ఇంత అగాధమైన ఆలోచనలో పడటానికి సాహసించాడు....

❀ ❀ ❀ ❀ ❀

అబ్బాయికి నిజమైన స్నేహితులుంటే, వాళ్లు వాడికి సరి అయిన సలహా ఇవ్వాల్సిన వాళ్లే! "ఒక్కసారిగా అగాధంలో దూకకురా, బాబూ! నిన్ను పైకి లాగే వాళ్లు కూడా ఉండరు!" అని నచ్చజెప్పే వాళ్లే. కాని తన స్నేహితులు తన ప్రజ్ఞను విశ్వసించనందున అబ్బాయి అదివరకనే వాళ్లందరితోనూ విరోధం కట్టాడు.

"ఏడిశావు లేవోయ్! నువ్వూ మా మాదిరిగా మోకాలులోతు ఆలోచనల్లో బోర్లాపడి కాళ్లూ చేతులూ ఆడించేవాడివేలే! పెద్ద పోకళ్లుపోకు" అని తన స్నేహితులన్నందుకు అబ్బాయి వాళ్లతో మీరు జన్మలో నాతో కూడకండి! అన్నాడు.

❀ ❀ ❀ ❀ ❀

చాలాకాలంగా అబ్బాయి, గజ ఈతగాళ్లని పేరుపడ్డవాళ్ల తోకపట్టి తిరుగుతూ వాళ్ల సంభాషణ అనుకరిస్తూ వచ్చాడు.

చేతల్లో కూడా వాళ్లననుసరించాలని ఆపరాని ఆవేశం పుట్టి చివరకబ్బాయి ఈ అగాథంలో దూకి ఊరుకున్నాడు!...

❀ ❀ ❀ ❀ ❀

అబ్బాయి అడుక్కు చేరాడు. అట్టడుగున ఉన్న బురదంతా కలియదొక్కక ఆలోచన యావత్తూ కెలకబారింది. నవరంధ్రాలా ఆలోచన కడవలకొద్దీ లోనికివెళ్లి అబ్బాయిని ఇంత లావున ఊదగొట్టింది. వాడికి స్పృహలేకుండా పోయింది. ఆ స్థితిలో అబ్బాయి అతి సులువుగా ఆలోచన పైకితేలి, ఏదో... ఒడ్డుకు కొట్టుకొచ్చాడు!...

❀ ❀ ❀ ❀ ❀

మళ్లా ఒళ్లు తెలియగానే పట్టరాని సంతోషం కలిగింది.

''ఆహా? ఇంత అగాథమైన ఆలోచన నేనుగాంగా ఈదగలిగాను!'' అనుకన్నాడబ్బాయి.

వెంటనే రొప్పుకుంటూ అబ్బాయి తను ఎరిగిన వాళ్లందరి దగ్గిరికిపోయి, “నేనెంత పెద్ద ఆలోచనలో దిగివచ్చామనుకున్నారు?” అన్నాడు.

“అందుకేనా ఏమిటి కర్మం, అట్లా బోదరించినట్టు కనబడుతున్నావు?” అని అడిగారు కొందరు.

అబ్బాయికి వాళ్లను చూస్తే కోపం వచ్చింది. “నేనేమీ బోదరించలేదు. నేనెప్పుడూ ఇట్లాగే ఉన్నాను. మీకళ్లకేమన్నా జబ్బు చేసిందమో, ఇంత కలికం వేసుకోండి!” అన్నాడు అబ్బాయి.

“ఊరికో ఆలోచన మీద తేలిరావటమేనా? లేక దానిలోతేమైనా చూసివచ్చారా?” అన్నారు మరికొందరు.

“ఆలోచన మీద తేలనూ తేలాను, దానిలోతూ చూసి వచ్చాను!” అన్నాడబ్బాయి.

“అయితే అడుగునించి పైకేం తెచ్చావో చూపించు!” అన్నారింకా కొందరు.

అబ్బాయికీసారి బాగా కోపం వచ్చింది. “నేను లోతు చూసివచ్చిన ఆలోచన ఎంత అగాథమైనదో స్వయంగా చూస్తే మీరీ అప్రస్తుత ప్రశ్నలు వెయ్యరు” అన్నాడబ్బాయి.

“ఏదీ, చూపించు!” అన్నారంతా...

❀ ❀ ❀ ❀ ❀

"ఇదుగో, చూడండి!" అన్నాడబ్బాయి.

అందరూ ముక్కుమీద వేలువేసుకుని, "ఓరి నీకర్మకాలా! ఆలోచనంతా ఇట్లాకెలికి వదిలి పెట్టావేం? మరొకడెవడూ కొంతకాలంపాటు దాని జోలికి పోవటానికి లేకుండా!" అన్నారు.

అబ్బాయికి శివమెత్తింది. "మీరంతా వెధవలు! అసలు నేను నా గొప్పతనం మీకు చూపించటమే బుద్ధితక్కువ. మీవంటి దౌర్భాగ్యులకు ప్రతిభావంతుణ్ని ఆదరించటం ఏం చాతనవును?" అని అబ్బాయి నానా తిట్లూ తిట్టాడు.

కొందరి అల్లరివాళ్లు, "వీణ్ని బోర్లాపడేసి పొట్టమీద తొక్కండి; ఆలోచన అపసవ్యంగా లోపలిసిపోయి, చూడండి, ఎట్లా బోదరించాడో! అంతా బయటికి కక్కించండి! లోకపోతే వాయువు కమ్ముతుంది!" అన్నారు.

ఈ మాట వినగానే అబ్బాయికి ఠారెత్తి పడుతూలేస్తూ పరిగెత్తి పోయినాడు.

❀ ❀ ❀ ❀ ❀

ఇప్పటికీ అబ్బాయి ఒళ్లు కాస్తో కూస్తో బోదరించే ఉంది. వాడు జన్మలో మళ్లీ ఎన్నడూ అగాథమైన ఆలోచనల్లో పడ్డ పాపానపోలేదు. కాని ఎవరైనా ఎరగని వాళ్లు తటస్థపడితే ఎన్నడో ఇక్ష్వాకుల నాడు తాను ఎంతో అగాథమైన ఆలోచలో దిగి దానిలోత చూసి జయప్రదంగా బయటికి వచ్చిన కథ చెప్పి ఆముదం రాస్తూంటాడు....

*రచన : 1943 ?*

*ముద్రణ : కుటుంబరావు సాహిత్యం ఆరవ సంపుటం,*
*విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్ 1994*